# ★ అమ్మ ★

పి. సౌభాగ్యలక్ష్మి

కిటికీలోంచి నక్షత్రాల వైపు చూస్తున్నాను.

హఠాత్తుగా దూరాన్నుంచి రైలు కూత వినిపించింది. ఉలిక్కిపడ్డాను. మీరా జ్ఞాపకాని కొచ్చింది. ఎంత భయంకరంగా ఉందా కూత?

ఆరేళ్ళకిందట నేనూ మీరా ఎంతో స్నేహంగా ఉండేవాళ్ళం. అప్పుడు మాకిద్దరికీ 10 ఏళ్లు. మీరా ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ ఉండేది. తల్లి చిన్నప్పుడే పోయింది. ఒకనాడు రాత్రి వాళ్లింటి కెళ్లాను నేను. డాబామీద నించొని నక్షత్రాల కేసిచూస్తోంది. వాళ్ళనాన్న లోపల పత్రిక చదువుకుంటున్నాడు. నే వెనకాలే వెళ్ళి మీరా కళ్ళు మూశాను. నా చేతికి నీళ్ళు తగిలాయి. భుజం మీద చెయ్యేసి "ఎందుకేడుస్తున్నావు మీరా! నాతో చెప్పవూ?" అన్నాను నేను. మీరా నన్ను చూసి కళ్ళు తుడుచుకుని "ఏం లేదు సీతా? దానికేం గాని చచ్చిపోయిన వాళ్ళంతా నక్షత్రాలవుతారని కొందరంటారు, నిజమేనంటావా' అంది ఏదో ఆలోచిస్తూ. ఇలాంటి విచిత్రప్రశ్న లెయ్యడం, నేను వాటికి సమాధానం చెప్పలేక పోడం మాకు రోజూ అలవాటే. నేను మాట్లాడకుండా చూస్తుంటే మళ్ళీ ఇలా అందుకుంది, "ఒకవేళ పోయినవాళ్ళంతా నక్షత్రాలవడం నిజమైతే, మా అమ్మ ఏ నక్షత్రంలో ఉందో? మా అమ్మ ఉన్న నక్షత్రం నా దగ్గిరకొస్తే ఎంత బాగుణ్ను? నే చచ్చిపోతే మా అమ్మను కలుసుకోగలనా? అంది. "అదేమిటీ మీరా అలా అంటావు? నీ మాటలు వింటుంటే నాకు కష్టంగా ఉంది. నీకీవేళ మంచి కథ చెప్తాను రా," అన్నాను మీరాని మరిపిద్దామని. ప్రతిరోజు ఇలాగే ఉండేది మీరా ప్రవర్తన. చిన్నపిల్లైనా విచిత్రంగా ఉండేవామె భావాలు.

మేమిద్దరం కలసి ఒకనాడు స్కూలుకెడుతున్నాం, "మనుష్యులెందుకు చచ్చిపోతారు?" అంది. స్కూలుకు ఆలస్యంగా వెడితే టీచర్లు తిడతారు. తొందరగా నడుస్తున్నాను నేను. మీరా ప్రశ్న విని "మీరా! పరీక్షలు దగ్గర కొస్తున్నాయి, ఇలాంటి ఆలోచనలు పెట్టుకుంటే ఎలాగ? స్కూలుకి ఆలశ్యమైపోతోంది త్వరగా రా?" అన్నాను.

మా పరీక్షలైపోయాయి. సెలవులిచ్చారు, రోజూ ఆడుకుందుకు వెడుతూనే ఉన్నాను వాళ్లింటికి. ఒకనాడు పరీక్ష ఫలితాలు తెలిశాయి నేను పేసయ్యాను. మీరా ఫెయిలయింది. ఆరోజు వెన్నెలగా ఉంది. వెన్నెట్లో సరదాగా ఆడుకుందామని వాళ్ళింటికెళ్ళాను. ఆవేళ మీరా ప్రవర్తన నాకాశ్చర్యం కలిగించింది. పరీక్ష పోయిందికదా ఆటకి వస్తుందో రాదో అనుకున్నా. కాని అలా కాకుండా పిల్చినవెంటనే ఆడుకుందుకు వచ్చింది. కొంతసేపయ్యాక నేను వెళ్ళిపోతానంటే? "రేపట్నుంచీ నిన్ను బలవంతం చెయ్యను లే, ఈ వేళమాత్రం చాలాసేపు ఆడుకో" అంది. ఈ వేళ వాళ్ళమ్మ మాటే ఎత్తలేదే అనుకున్నా.

మర్నాడు మధ్యాహ్నం ఇంట్లో కూర్చొని చెల్లాయిని ఆడిస్తున్నా. మీరా రైలుకిందపడి పోయిందని మాకు తెలిసింది. వెంటనే మేమంతా ఆస్పత్రి కెళ్ళాం. దెబ్బలు చాలా తగిలాయి. కళ్లుమూసుకొని మూల్గుతోంది. పక్కనే వాళ్ళ నాన్న విచారంగా చూస్తున్నారు. "మీరా?" అనిపిలిచింది మా అమ్మ మెల్లిగా. కళ్లు తెరచి మాకేసి చూసింది. "మీరా రైలుకింద పడిపోడం ఎందుకు? నిన్నెవరేనా ఏమేనా అన్నారా?" అనడిగిందమ్మ. మీరా మెల్లిగా "నే బ్రతికుండి ఏం లాభం? మా అమ్మ లేకుండా నే నెన్నాళ్ళుండగలను?" అని వాళ్ళ నాన్నకేసి చూసి "నాన్నా! అమ్మ దగ్గరకి వెళ్లాలని ఉంది. అందుకీపని చేశాను." అంది. "రేపు నిన్ను ఉండమన్ను లే?" అన్న మీరా మాటలకి అర్థం తెలిసిందినాకిప్పుడు. మా అమ్మా, నేనూ మాట్లాడలేక పోయాం. మీరా నాకేసి చూసి "సీతా నన్ను మర్చిపోకేం," అంది. మళ్ళా ఒకమాటు మూల్గి వాళ్ళమ్మ దగ్గరికి వెళ్లిపోయింది మీరా. అప్పటికి ఇప్పటికి రైలుకూత వింటే ఏదో బాధగా ఉంటుంది.

మీరా! ఈ నక్షత్రాల్లో ఏ నక్షత్రంలో ఉన్నావు నువ్వు? మీ అమ్మ ఉన్న నక్షత్రం దగ్గరే ఉన్నావా? మీ అమ్మ నిన్ను ప్రేమతో ఆహ్వానించిందా? "నన్ను మర్చిపోకేం" అన్నావు నిన్ను మర్చిపోగలనా మీరా?